


*(గత సంచిక తరువాయి)*

**దాదాపు అరగంట** సేపు ఆడారు. రాజేష్ బెలూన్ రెండుసార్లు, దశరథరామయ్య బెలూన్ అయిదుసార్లు బక్కెట్‌లో పడింది. దశరథరామయ్య ఇరవైమూడోసారి విసురుతుండగా, అది ఆయన చేతిలోనే పగిలిపోయింది. ఇద్దరూ ఒకే బెలూన్‌తో విసరసాగారు. నాలుగోసారి దశరథరామయ్య విసరగా, గాలిలో పేలిపోయింది.

"బావుందిరా ఈ ఆట. మళ్ళీ బెలూన్‌లు తీసుకురా."

ఈసారి అర్ధరూపాయి బెలూన్స్ కొన్నాడు రాజేష్.

"ఇన్ని ఎవరికి?" అడిగాడు బెలూన్స్ అమ్మే షాపతను.

"నేను, మా తాతయ్య ఆడుకోడానికి" చెప్పాడు రాజేష్.

"మీ తాతయ్యా, నువ్వూనా? బెలూన్స్‌తో ఆడుకుంటున్నారా?" అడిగాడతను ఆశ్చర్యంగా.

"అవును. తాతయే గెలుస్తున్నాడు."

"తాతయ్యా! మనం ఈ బూరలు వూదినప్పుడు ఏం వస్తే అది చెయ్యాలి సరేనా?" చెప్పాడు ఇంటికి వెళ్ళగానే.

"ఏం వస్తుంది?"

"ఊది చూడు" ఎక్సయిటింగ్‌గా చెప్పాడు.

దశరథరామయ్య ఓ బూరని వూది దారం కట్టాడు. గాలితో నిండిన ఆ ఆకుపచ్చ బెలూన్ మీద పెన్‌తో రాజేష్ ముందుగా రాసిన అక్షరాలు కనబడ్డాయి.

"రెండు గుంజీలు."

"తియ్యి తాతయ్యా" చెప్పాడు రాజేష్ నవ్వుతూ. ఆయన దృష్టి రాజేష్ జేబులోని స్కెచ్ పెన్‌మీద పడింది.

"చచ్చాంరా బాబూ. తీస్తాను."

రెండు గుంజీలు తీసాడు దశరథరామయ్య.

తర్వాత రాజేష్ వూదిన బూరమీద 'నిశ్శబ్దం' అని వుంది.

"నేను ఓ నిమిషం సేపు మాట్లాడకూడదన్నమాట."

రాజేష్ నిముషంపాటు మౌనంగా వున్నాడు. నిమిషం అయ్యాక చెప్పాడు.

"నీకు తెలియదు తాతయ్యా! అమ్మయితే నాకు చక్కిలిగింతలు పెట్టి నవ్విస్తుంటే, 'అదిగో నిశ్శబ్దంగా లేవు' అంటుంది."

దశరథరామయ్య వూదిన మూడో బూరమీద 'చక్కెర తిను' అని వుంది.

"అరే! అది నాకొస్తే బావుండనుకున్నా."

రాజేష్ వంటగదిలోకి పరిగెత్తికెళ్ళి ఓ స్పూన్‌తో చక్కెర తెచ్చి దశరథరామయ్య చేత తినిపించాడు.

"నాలుగో బూరమీద 'నడు' అని వుంది. రాజేష్ అటూ, ఇటూ నడిచాడు. ఈసారి దశరథరామయ్య వూదిన బూరమీద 'ఏడు' అని వుంది.

"నువ్విప్పుడు ఏడవాలి తాతయ్యా" చెప్పాడు రాజేష్ ఉత్సాహం"

"రాకపోయినా?"

"రాకపోయినా"

దశరథరామయ్యకి తన వయసు గుర్తుకు వచ్చింది. ముందు సందేహించినా తరువాత ఏడుస్తున్నట్లుగా అభినయించాడు.

పెద్ద చిన్నపిల్లవాడు, చిన్న పెద్దపిల్లవాడు వూదిన ఆ అయిదు బూరలమీద రాసినట్లుగా చేశారు.

"ఈ ఆటకూడా బావుందిరా" చెప్పాడు దశరథరామయ్య.

"నీ తెల్లమీసం కన్నానా?" నవ్వాడు రాజేష్.

"తాతయ్యా, ఇప్పుడు వాటితోనే ఇంకో ఆట" తన పెట్టె తెరిచి కొన్ని గోళీకాయలని తీసి జేబులో వేసుకుని చెప్పాడు.

"పద."

రాజేష్ ఆయన చేతిని పట్టుకుని నడిపించి ఇంటిముందున్న ఆవరణలోకి తీసుకువెళ్ళాడు.

ఓ బూరని తీసి గోడకు ఆనించి పెట్టి చెప్పాడు ఆయన చేతికి గోళీకాయ యిచ్చి.

"గురి చూసి దాన్ని బద్దలుకొట్టు చూద్దాం."

ఆయన విసిరిన గోళీ బూరకి దూరంగా ప్రక్కగా దూసుకెళ్ళింది గోడకి కొట్టుకుంది.

"జరుగు. ఇప్పుడు నేను."

అయిదు బెలూన్లూ పది నిముషాల్లో పేలిపోయాయి.

"మీ అమ్మకి ఎన్ని మంచి ఆటలు వచ్చురా?" మెచ్చుకున్నాడు దశరథరామయ్య. ఒకో బూరకి గోళీ తగిలి పగలగానే రాజేష్ చప్పట్లు కొడుతూ ఆనందంతో గంతులు వేయడం చూసి

"ఇప్పుడు నేను ఆ బూరని గాల్లోకి విసురుతాను. అది నేలమీద పడేదాకా గోళీకాయలు విసిరి దాన్ని కొట్టగలరేమో చూద్దాం పద."

రాజేష్ 'ఒన్, టూ, త్రీ' చెప్పి ఓ బెలూన్‌ని గాల్లోకి విసిరాడు. అది నేలమీదకి చేరుకునే లోపలే ఆరు గోళీలు విసిరినా దాన్ని కొట్టలేక పోయాడు దశరథరామయ్య. రాజేష్ వంతు వచ్చీ రాగానే రాజేష్ విసిరిన మొదటి గోళీకే అది గాల్లో పేలింది.

దశరథరామయ్య దృష్టి అకస్మాత్తుగా రోడ్డుమీద పడింది. ఆ సందులో నడిచి వెళ్ళేవాళ్ళు చిన్నపిల్లవాడితో సహనంగా ఆడుతున్న ఆయన్ని వింతగా చూస్తూ వెళుతున్నారు.

దశరథరామయ్యకి కొన్ని క్షణాలు సిగ్గు వేసింది. కొన్ని క్షణాలే. తరువాత మళ్ళీ ఆడగసాగాడు.

అయిదు నిముషాల తర్వాత వాళ్ళని చూసిన బన్ని పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పింది.

"నన్ను పిలవలేదెందుకురా? నేనూ ఆడతా్నా."

ఈసారి దశరథరామయ్య విసిరిన గోళీ పక్కింటి కిటికీలోంచి దూసుకువెళ్ళింది. ఏదో పగిలిన చప్పుడు. వెంటనే పక్కింటాయన కంఠం వినిపించింది గట్టిగా.

"ఎవడ్రావాడు?"

ముగ్గురూ ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. పక్కింటాయన కిటికీలోంచి బయటికి చూస్తూ అడిగాడు ఉగ్రంగా.

"ఎవరి పనది?"

"ఈయన వేలితో దశరథరామయ్యని చూపించింది బన్ని.

తీక్షణంగా చూసే ఆయన చూపుల్లోకి కొద్దిపాటి ఆశ్చర్యం ప్రవేశించింది.

"సారీ" చెప్పాడు దశరథరామయ్య.

"మా అబ్బాయి రాగానే రిపేర్ చేయిస్తాను."

"ఆయన, బన్ని, రాజేష్ మిగిలిన బెలూన్‌లని అందుకుని నిశ్శబ్దంగా ఇంట్లోకి నడిచారు.

## 16

సాంబశివరావు తన మేనేజర్ అనుమతి తీసుకుని విజయవాడ ఎస్.టి.డి చేశాడు. 0866 తిప్పి సావిత్రి పనిచేసిన 'లిటిల్ ఫ్లవర్' కాన్వెంట్ నంబరు తిప్పాడు. మూడుసార్లు ప్రయత్నం చేస్తే నంబరు కలిసింది.

"హలో నేను హైదరాబాద్ నించి ఎస్.టి.డి.లో మాట్లాడుతున్నాను సావిత్రి అక్కడుందా?" అడిగాడు.

"ఏ సావిత్రి?"

"టీచర్."

"సెలవలుగా ఇప్పుడు లేదు. ఏం?"

"ఇప్పుడు ఎక్కడ వుంటోందో మీకెవరికయినా తెలుసా?"

"తెలీదు. మీరెవరు?"

కొద్దిగా సందేహించి చెప్పాడు.

"నా పేరు రావు. ఆవిడ హైదరాబాద్‌కి వచ్చిందని తెలిసింది. వస్తే ఎక్కడ వుంటుందో చెప్పగలరా? చాలా అర్జెంట్?"

"తెలీదు"

"ఎవరికో ఒకరికయినా తెలిసి వుండాలిగా? ప్లీజ్ అడిగి చూడండి"

"ఇక్కడ నేను తప్ప ఎవరూ లేరు. ఎవరికీ తెలియదు కూడా. కాన్వెంట్ తెరిచాక ఫోన్ చేయండి."

"ఎప్పుడు తెరుస్తారు?"

"జూన్ పది."

అవతలివైపు లైన్ కట్ చేశారు. సాంబశివరావు రిసీవర్ క్రెడిల్ మీద వుంచాడు.

"థాంక్స్ సర్" చెప్పి మేనేజర్ కాబిన్‌లోంచి బయటికి నడిచాడు.

నీరజ యూనివర్శిటీనుంచి ఇంటికి రాగానే దశరథరామయ్య కవరు ఆమెకి ఇచ్చి చెప్పాడు.

"పోస్టులో వచ్చింది నీకు."

ఆ కవరు మీది చేతివ్రాతని వెంటనే గుర్తుపట్టింది. సహజది, విజయవాడనుంచి. బాత్‌రూంలోకి వెళ్ళి మొహం కడుక్కుని ముందర కాఫీ చేసి మామగారికి ఇచ్చి, తను తాగి మిగిలింది భర్తకోసం ఫ్లాస్క్‌లో పోసింది. తరువాత తీరికగా కవరు చింపి అందులోని ఉత్తరం బయటకి తీసింది ఆ ఉత్తరానికి స్టేపిల్ చేయపడ్డ పేపర్ కటింగ్స్ మీద పడింది ఆమె దృష్టి. ఒక దాంట్లో రాజేష్ ఫోటో.

ఫోటో క్రింద వ్రాసిన వాక్యాలు చదివింది. "ఈ అబ్బాయి పేరు రాజేష్. ఇతని తల్లితండ్రుల వివరాలు తెలియచేసినవారికి నూటపదహార్లు బహుమతి యివ్వబడును. బాక్స్ నంబర్ 9776."

ఇంకో కటింగ్‌లో "సావిత్రీ మీ అబ్బాయికి ఒంట్లో బాగోలేదు. తప్పక ఈ లెటర్ చదివిన తక్షణం హైదరాబాద్ రావలసిందిగా కోరుతున్నాను."

**సాంబశివరావు**

**విజయవాడ**

ఉత్తరం చదవసాగింది.

**డియర్ ఎన్,**

క్షేమంగా చేరావనుకుంటాను. నువ్వు వెళ్ళి దాదాపు పదిరోజులు అయినా ఇంకా చేరినట్టు లెటర్ రాయలేదే? ఎలా వున్నావ్?

పోతే, నీ వెంట తీసుకువచ్చిన రాజేష్‌కి సంబంధించిన ప్రకటనలు జతచేసి పంపుతున్నాను. నువ్వు ఇక్కడ నాకు చెప్పిన విషయాలు, ఈ ప్రకటన చూస్తుంటే నాకంతా మిస్టరీలా వుంది. పూర్తి వివరాలు రాయాలనిపిస్తే రాయి. లేదా ఫర్వాలేదు. జయంతి తెలుసుగా నీకు. ఆ అమ్మాయి చూసి నాకు వీటిని చూపించింది. మీ ఆయన స్టేట్ బాంక్‌లోనేగా పని చేసేది? ఎక్కడని అడిగితే చెప్పాను.

నీ జవాబు కోసం ఎదురుచూస్తూ,

**ఎస్**

నీరజ నిశ్శబ్దంగా దశరథరామయ్య దగ్గరకు వెళ్ళి దాన్ని ఆయనకి అందించింది.

"ఏమిటిది?" అడిగాడు.

సమాధానం చెప్పకుండా నీరజ తమ గదిలోకి నడిచింది. ఎదురుగావున్న మంచం మీద కాసేపు చూసింది. క్రితం రాత్రి తామిద్దరం పడుకున్న మంచం.

వెళ్ళి మంచం మీద దిండుని అందుకుని దాంతో గబగబా పరుపు మీద పిచ్చి ఆవేశంతో బాదసాగింది. అలా పది, పదిహేనుసార్లు బాది ఏడుస్తూ నేలమీదకి జారిపోయింది. రెండు చేతులతో మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

సాంబశివరావు బేంక్ నుంచి సరాసరి ఇంటికి వచ్చాడు. తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకున్న నీరజని చూశాడు.

"అదేం? వంట్లో బాగోలేదా?" అడిగాడు మంచం మీద కూర్చుని భార్య వంటిమీద ఆప్యాయంగా చెయ్యివేసి.

"లేదు"

"ఎలాగూ డాక్టర్ దగ్గరకి వెళ్ళాలిగా. లేచి మొహం కడుక్కో"

"రాజేష్‌ని మీరు తీసుకువెళ్ళండి. నాకు రావాలనిలేదు" కళ్ళు మూసుకునే చెప్పింది నీరజ.

"మళ్ళీ ఏమైంది?" అడిగాడు సాంబశివరావు కొద్దిగా భయంగా.

"ఏం కాలేదు. నన్ను విసిగించకండి."

చిన్నగా నిట్టూర్చాడు.

"మళ్ళీ మొదటికి వచ్చావన్నమాట. ఏం జరిగిందో చెప్పు" లాలనగా అడిగాడు.

"పెళ్ళికాకముందు సరే ఇప్పుడు భార్యకి తెలియకుండా రహస్యంగా కొన్ని పనులు చేయటం మీకు తప్పనిపించటంలేదా?" అడిగింది కళ్ళు తెరిచి భర్తవంక చూస్తూ.

"ఏం పనులు?"

"పేపర్‌లో మీరిచ్చిన ప్రకటన గురించి నాకెందుకు చెప్పలేదు?"

సాంబశివరావు కాసేపు మౌనంగా వుండిపోయాడు. తరువాత అడిగాడు.

"నీకెలా తెలుసు?"

"అది నా ప్రశ్నకి సమాధానమా?"

"కాదు. సావిత్రి ప్రసక్తి మళ్ళీ నీ దగ్గర తీసుకురావడం యిష్టంలేక"

"అంతేనా లేక సావిత్రిని కలుసుకుని ఇంతపని ఎందుకు చేశావ్ అని నిలదీయడానికా? నిజం ఎందుకు చెప్పలేదు మీరు? ఇంత జరిగాక సావిత్రి మీ మొదటి భార్యని తెలిసీ భరించాను కదా అనా?"

"సావిత్రికి నాకూ వివాహం కాలేదు."

"కాకుండానే రాజేష్ పుట్టాడా?"

"సావిత్రి ఎవరో నాకు నిజంగా తెలీదు. ఆమెను ఎన్నడూ చూడలేదు. ఇది నిజం దయచేసి సర్దుకున్న నా మనసులోకి మళ్ళీ యిలాంటి ఆలోచనలు రానీయకు. నన్ను నమ్ము. నేనూ, జయంతి క్లోజ్‌గా వున్న మాట వాస్తవం. అంతే. అంతకుమించి నాకెవరితో పరిచయంలేదు. అన్నిటికన్నా ముఖ్యంగా మన వివాహం అయ్యాక నేను పరాయి ఆడవాళ్ళకి దగ్గిరవుదామని ఎన్నడూ అనుకోలేదు నాకలాంటి అవసరంలేదు. వయస్సులో, నా గతంలో నేను మంచివాణ్ణి కాదు. ఒప్పుకుంటాను. కానీ వర్తమానంలో, భవిష్యత్తులో ఎప్పుడు అలా పిచ్చిగా ప్రవర్తించను. నాకున్నది ఒకటే జీవితం. దాన్ని నాశనం చేసుకోను. నీలో ఏం తక్కువైందని?"

అతని హితబోధ నీరజ మనస్సుకి కాస్త తెరిపిని, శాంతిని ప్రసాదించింది.

"లే.. స్నానం చేస్తే ఫ్రెష్‌గా వుంటుంది. డాక్టర్ దగ్గరకి వెళ్ళివద్దాం."

మళ్ళీ కొడుకు, కోడలు ఎడమొహం పెడమొహంగా వుంటారనుకున్న దశరథరామయ్యకి, వాళ్ళు కలిసి వుండటంతో సంతోషం కలిగింది. ఆయనకి బాధగా వున్న విషయం ఒక్కటే. రాజేష్‌ని అనాథశరణాలయంలో చేర్చడం.

నీరజ యూనివర్శిటీనించి వస్తూ రాజేష్ మెడికల్ రిపోర్ట్స్ తెచ్చింది. మళ్ళీ ముగ్గురూ వాటితో డాక్టర్ హసన్ క్లినిక్‌కి వెళ్ళారు.

ఆయన ఎక్స్‌రేని పరిశీలించాడు కొద్దిసేపు, తర్వాత బ్లడ్ రిపోర్ట్‌ని చదివాడు.

"ఎనీ ప్రాబ్లమ్?" అడిగాడు సాంబశివరావు.

డాక్టర్ హసన్ వెంటనే సమాధానం చెప్పలేదు. మరోసారి ఎక్స్‌రేని పరిశీలించాడు.

"కిడ్నీస్ సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో క్లియర్‌గా తెలియాలి. రేపు ఉదయం రాజేష్‌ని మరోసారి ఎక్స్‌రే తీయించండి. ఉదయం నిద్రలేచాక పచ్చి మంచినీళ్ళు కూడా ఇవ్వకూడదు. ఎక్స్‌రే అయితే ఏమైనా పట్టచ్చు"

ప్రిస్కిప్షన్ రాసిచ్చాడు.

"ఎనీథింగ్ సీరియస్?" అడిగాడు సాంబశివరావు.

"ఎక్స్‌రే చూసికాని చెప్పలేను."

మర్నాడు ఉదయం పేథలాజికల్ లేబరేటరీకి తీసుకువెళ్ళారు రాజేష్‌ని. ప్రిస్కిప్షన్ చదివి అడిగాడు పేథలాజిస్ట్.

"పొద్దున్న ఏం యివ్వలేదుగా?"

"ఊహు."

ఆయన రాజేష్‌కి ఐ.బి.పి. ఇంట్రావీనస్ ఇంజక్షన్ ఇచ్చి చెప్పాడు.

"ఈ మందు మూత్రపిండాలకి చేరడానికి షుమారు పది నిముషాలసేపు పడుతుంది. ఎక్స్‌రేలో ఆ మందు పయనించే మార్గం కనబడుతుంది. మనకి కావలసిన వివరాలు తెలియకపోతే మొదటి ఎక్స్‌రేలో మరోసారి తియ్యాలి"

గంటన్నరలో రెండు ఎక్స్‌రేలు తీశారు. గంట తర్వాత మళ్ళీ యింకో ఎక్స్‌రే తీశారు. సాంబశివరావు బేంక్‌కి టైం అవడంతో నీరజని చూసుకోమని వెళ్ళిపోయాడు.

ఉదయం పదకొండున్నరకి రాజేష్‌కి కాఫీ యివ్వచ్చని చెప్పారు. పన్నెండున్నరకి ఇంటికి తీసుకువెళ్ళి భోజనం పెట్టి మళ్ళీ తీసుకురమ్మని చెప్పారు ఆరో ఎక్స్‌రేలో, సాయంత్రం నాలుగున్నరకి కావలసిన ఫలితం వచ్చింది.

"కిడ్నీస్ సరిగ్గానే వున్నాయి. ఈ అబ్బాయికి యూరిన్ బయటికి వచ్చే ట్యూబ్‌లో చిన్న అడ్డు వుంది" చెప్పాడు ఎక్స్‌రేలున్న కవరు యిచ్చి.

నీరజ వేసిన అనేక ప్రశ్నలకు ఒకటే జవాబు చెప్పాడు.

"డాక్టర్‌ని అడగండి చెప్తారు"

ఇంటికి తిరిగి వచ్చాక రాజేష్ తన ఉడుతపిల్ల 'టింకూ' కనబడటం లేదన్న సంగతి చూసుకున్నాడు. కార్టన్‌లో లేదు. ఇంట్లో ఎక్కడా లేదు. ఇల్లంతా వెదికారు. ఎటు వెళ్ళిపోయిందో తెలియలేదు. బన్ని, దశరథరామయ్య కూడా వెదకడంలో సహాయం చేశారు. కానీ అది కనబడలేదు.

"పోనీలేరా ఇంకోటి తెచ్చుకుందాంలే" సముదాయించింది బన్ని.

రాజేష్ ఓ మూల మోకాళ్ళలో తలపెట్టుకుని కూర్చున్నాడు విచారంగా. ఇద్దరూ ఎంత బతిమాలినా ఆడటానికి లేవలేదు.

దశరథరామయ్యకి రాజేష్ అలా మూగగా వుండటం ఎంతమాత్రం నచ్చలేదు.

"నీకు ఉడతలు, జంతువులంటే అంత యిష్టమా?" అడిగాడు.

"అవును. ఓసారి నేను మా పక్కింటి కుర్రాడు ఓ కుక్కని కొట్టినందుకు వాణ్ణి తన్నాను" జవాబు చెప్పాడు రాజేష్.

సాయంత్రం నీరజ భర్త రాగానే చెప్పింది.

"ఎక్స్‌రే రిపోర్ట్ తెచ్చాను. ముందర హాస్పిటల్‌కి వెళ్ళివద్దాం పదండి."

రాజేష్ అవసరం లేకపోవటంతో అతన్ని వదిలేసి దంపతులిద్దరూ వెళ్ళారు.

డాక్టర్ ఆ ఎక్స్‌రేని పరిశీలించి చెప్పారు.

"నేను సర్జన్ పేరు, చిరునామా చెప్తాను. ఈ రిపోర్ట్ తీసుకుని ఆయన్ని ఆలస్యం చేయకుండా కలవండి."

ఓ కాగితం మీద చిరునామా రాసిచ్చాడు.

"ఏదయినా సీరియస్సా?" అడిగాడూ సాంబశివరావు ఆదుర్దాగా.

"నేనేం చెప్పలేను. ఈయన పేరు శశిభూషణ్. సౌత్ ఇండియాలో యూరాలజీ స్పెషలిస్ట్. ఈయన్ని కన్‌సల్ట్ చేయండి."

"ఇప్పుడు వెళితే వుంటారా?"

డాక్టర్ హసన్ ఆయనకి ఫోన్ చేసి కనుక్కుని చెప్పాడు.

"ఉన్నాడు. వెంటనే వెళ్ళండి."

ఇద్దరూ ముప్పావుగంట తరువాత డాక్టర్ శశిభూషణ్ ముందున్నారు. ఆయన వయస్సు ఏభై ఆరుదాకా వుంటుంది. సన్నగా, పొట్టిగా వుంటాడు. ఎంతో ప్రశాంతంగా వుంటుంది మొహం.

ఆయన రాజేష్‌కి సంబంధించిన మెడికల్ రిపోర్ట్స్ అన్నీ పరిశీలించి అడిగాడు.

"వాంతులేమైనా అయ్యాయా ఈ మధ్య?"

"అయ్యాయి."

"ఆకలి వుందా?"

"ఈ మధ్య తక్కువ తింటున్నాడు" చెప్పింది నీరజ.

"ఐయామ్ సారీ. మీ అబ్బాయికి ఎంత త్వరగా ఆపరేషన్ చేస్తే అంతమంచిది" చెప్పాడు ఆ ఎక్స్‌రేలు శ్రద్ధగా పరిశీలించి.

"ఆపరేషనా?" భయంగా అడిగింది నీరజ.

"మా అబ్బాయి కాదు" చెప్పాడు సాంబశివరావు.

"పుట్టుకతో వచ్చిన ఈ లోపం వెంటనే సరిచెయ్యాలి."

"ఏం లోపం?" అడిగింది నీరజ.

"కంజెనిటక వాల్ సేఫ్ ఆఫ్ యూరేత్రా."

"అంటే?" ఇద్దరూ అడిగారు.

"బ్లేడర్ నుంచి యూరిన్ శరీరం బయటకి వెళ్ళే ట్యూబ్‌లో అబ్‌స్ట్రక్షన్ ఏర్పడింది. చిన్నపిల్లవాడుగా వుండగా యూరిన్ అవుట్ పుట్ తక్కువగా వుంటుంది కాబట్టి ఈ లోపం బయటపడలేదు. పెద్దయ్యాక ఇప్పుడు బ్లేడర్ నిండిపోతోంది. దాంతో బ్లేడర్ ఎక్స్‌పాండ్ అయింది కూడా. అంతేకాదు. యూరిన్ మూత్రపిండాల్లోకి బేక్ పంపింగ్ జరుగుతోంది."

"మందులతో సరిచేయలేరా?" అడిగింది నీరజ. అప్పటికే నెర్వస్ అయిపోయింది ఆమె.

"ఉహూ. శస్త్ర చికిత్స చేసి కిడ్నీలని సెట్ చేసి, బ్లేడర్‌ని క్లీన్ చేసి అబ్‌స్ట్రక్షన్‌ని తొలగించాలి. అదొక్కటే మార్గం."

"ఆపరేషన్ చేయించకపోతే?" అడిగాడు సాంబశివరావు.

"బ్లేడర్‌లోని యూరిన్ బయటికిపోలేక కిడ్నీలలోకి బేక్ పంపింగ్ జరుగుతోంది. చివరికి రెండూ యూరిన్‌తో నిండిపోయి, అది బయటికి వెళ్ళేదారి లేకపోవడంతో పేషెంట్ కొలాప్స్ అవుతాడు."

ఇద్దరి మొహాల్లోని భయాన్ని గ్రహించి చెప్పాడు శశిభూషణ్.

"ఇలాంటి లోపం చాలామందిలో మామూలే. నేను కొన్నివేల ఆపరేషన్స్ చేశాను. వందలు కాదు, వేలు. మీరు అధైర్యపడాల్సిన అవసరంలేదు.

"మైనరా లేక మేజర్ ఆపరేషనా?" అడిగాడు సాంబశివరావు.

"మేజర్."

"ఎంతసేపు పట్టచ్చు?" అడిగింది నీరజ వెంటనే.

"కనీసం మూడుగంటలు."

"హాస్పిటల్‌లో ఆ తరువాత ఎన్ని రోజులుండాలి?" అడిగాడు సాంబశివరావు.

"కనీసం మూడు వారాలు. పరిస్థితిని బట్టి ఇంకా ఎక్కువ రోజులే కావచ్చు."

"ఏ హాస్పిటల్?"

"సికింద్రాబాద్ నర్సింగ్ హోమ్‌లో అన్ని సౌకర్యాలు వున్నాయి. అయితే అక్కడ బెడ్స్ ఖాళీ వున్నాయో లేవో నాకు ఐడియా లేదు. మీరు ఎప్పుడు చేయించగలరు?" అడిగాడు శశిభూషణ్.

"రేపు సాయంత్రం వస్తాం మళ్ళీ. రేపు చెప్తాను" చెప్పాడు సాంబశివరావు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in